క్లుప్తంగా

సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి



పెసరపంటను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అధికారి కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న వరి, పెసర, మినుము, పత్తి, కంది పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంటలు రోగాల బారిన పడకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. ఆరుతడి పంటలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు అఖిల్, వినిత్ తదితరులు ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇల్లు

రేగోడ్(మెదక్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా వర్షాలు పడుతున్నాయి. మండలంలోని మర్పల్లిలో గ్రామానికి చెందిన దత్తు ఇల్లు శుక్రవారం రాత్రి కూలిపోయింది. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

పాక్షికంగా కూలిన ఇల్లు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలంలో ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండడంతో మండలంలోని గవ్వలపల్లి తండాలోని కాట్రోత్ జమిలి నివాస గృహం పాక్షికంగా కూలిపోయింది. అలాగే ఖాజాపూర్‌లో పాత ఇళ్లు కూలినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దామోదర్ మాట్లాడుతూ.. శిథిలమైన ఇళ్లలో ఉండవద్దని సూచించారు.

చిత్తడిగా మారిన మట్టి రోడ్డు



చిత్తడిగా మారిన చిలప్‌చెడ్–గుజిరి తండా రోడ్డు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వర్షాలకు చిలప్‌చెడ్ నుంచి గుజిరితండాకు వెళ్లే మట్టి రోడ్డు చిత్తడిగా మారింది. ఈ దారి గుండా సాగు భూములు ఉండటంతో రైతులు నిత్యం వెళ్లే దారి.పైగా గౌతాపూర్ గ్రామప్రజలకు, అటు వైపున తండా వాసులకు, మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌కు వెళ్లేందుకు అడ్డదారి. ప్రస్తుతం ఆ దారి కురుస్తున్న వర్షాలకు పూర్తిగా బురదమయంగా మారింది. కనీసం ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దాంతో పొలాలకు వెళ్లే రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

చెరువు కాదు.. మైదానమే!



చెరువును తలపిస్తున్న కౌడిపల్లి ఉన్నత పాఠశాల మైదానం

కౌడిపల్లి(నర్సాపూర్): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడపడితే అక్కడ నీరు చేరి, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో వర్షపు నీరు చేరడంతో చెరువును తలపిస్తుంది. దాంతో విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లాలన్న, బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

అధిక ధరలకు స్టీల్ సిమెంట్ అమ్మితే చర్యలు

ఎంపీడీఓ దామోదర్



మాట్లాడుతున్న ఎంపీడీఓ దామోదర్, తహసీల్దార్ మాలతి

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు స్టీల్ సిమెంట్‌ను నిర్దేశిత ధరలకు విక్రయించాలని ఎంపీడీఓ దామోదర్, తహసీల్దార్ మాలతి ఆదేశించారు. శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ మేస్త్రీలతో పాటు స్టీల్, సిమెంట్ దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యమైన ప్రమాణాలు పాటించేందుకు మేస్త్రీలు, దుకాణదారులు సహకరించాలన్నారు. ఉప తహసీల్దార్ ప్రభుదాస్, ఏఈ పాల్గొన్నారు.

అప్రమత్తం లేకుంటే ప్రాణాలకే ముప్పు

- విద్యుత్ ప్రమాదాలపై అధికారుల సూచనలు
- ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని హితవు

చేగుంట(తూప్రాన్): వరుసగా కురుస్తున్న వానలు.. జోరందుకున్న వ్యవసాయ పనులు సాగుతున్న సమయంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. లేకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. ఈనెల 13న బోనాల్ గ్రామంలో వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా జరిగే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పోయిందని రైతు చిత్తం మరమ్మతు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ట్రాన్స్‌ఫార్మర్‌పైనే ప్రాణాలు పోగొట్టుకున్నాడు. 15న ఇబ్రహీంపూర్‌లో రైతు శ్రీనివాస్ వ్యవసాయ పొలం వద్ద స్టాటర్ పని చేయకపోవడంతో రిపేర్ చేస్తున్న క్రమంలో కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలొదిలాడు. ఈ రెండు ఘటనలు దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పొలాల వద్ద మోటార్లు, స్టాటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల వద్ద లోపాలు ఏర్పడితే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలేగానీ.. నేరుగా మరమ్మతు చేయకూడదని అంటున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో తడి, చేతులతో ఇంట్లో స్విచ్చులు, ఇనుప తీగలపై ఆరేసిన బట్టలు తీసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించుకోవచ్చు. వర్షాల సమయంలో విద్యుత్ ప్రమాదాలపై సంబంధిత అధికారులు సిబ్బంది కేవలం సోషల్ మీడియాలో ప్రకటనలకే పరిమితం కాకుండా అప్పుడప్పుడు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



బోనాల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ సరిచేస్తూ విద్యుదాఘాతానికి గురైన చిత్తం

జాగ్రత్తలు పాటించాలి :



వర్షాలు కురుస్తున్న సమయాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. గ్రామాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండటంతో పాటు వర్షాల ఇబ్బందులను రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందిస్తే సంబంధిత అధికారులే ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటారు. వర్షాలతో చెట్లు, పాత ఇళ్లు, విద్యుత్ స్తంభాలు కూలినా ప్రమాదాలు జరిగినా సమాచారం అందించేందుకు కలెక్టర్ రాహుల్‌రాజ్ 9391942254 టోల్ ఫ్రీ నంబర్‌కు సైతం ఏర్పాటు చేయించారు.

\- తహసీల్దార్ శ్రీకాంత్

నీటి నిల్వలను తొలగించాలి

- పొలాల్లో కాల్వలు ఏర్పాటు చేయండి
- జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్

నర్సాపూర్: వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున పంట పొలాల్లో ఉన్న నిల్వ నీటిని తొలగించాలని జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ రైతులకు సూచించారు. శనివారం పట్టణంలో పలు దుకాణాల్లో తనిఖీల అనంతరం ఆయన మాట్లాడారు. ఎక్కువ వర్షాలు కురుస్తున్నందున వీలైనంత తొందరగా పంట పొలాల నుంచి నిల్వ ఉన్న నీటిని తీసేయాలని, నీరు వెళ్లేందుకు పొలాల్లో కాల్వలు చేయాలని సూచించారు. మరో నాల్గు రోజుల పాటు తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పొలాల్లో ఎరువులు, పురుగు మందుల పిచికారీ తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత వరినాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. కాగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నందున రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, కరెంటు వైర్లు చూసుకుని పంట పొలాల్లో తిరగాలని, మోటార్లు ఆన్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దేవ్‌కుమార్ చెప్పారు. వర్షం కురిసే సమయంలో చెట్ల కింద ఉండరాదని, పశువులు, మేకలు గొర్రెలను చెట్ల కింద ఉంచరాదని హితవు పలికారు. కాగా పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలలో తనిఖీలు చేసి యూరియా, ఇతర మందుల స్టాకు, రిజిస్టర్ల నమోదు పట్టికలను దేవ్‌కుమార్ పరిశీలించారు. ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలని, ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లకు హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా సహాయ వ్యవసాయాధికారి విన్సెంట్ వినయ్‌కుమార్, స్థానిక ఏడీ సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారి దీపిక తదితరులు ఉన్నారు.



ఎరువుల దుకాణంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న దేవ్‌కుమార్ తదితరులు

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హన్మంత్‌రావు



నియామక పత్రాన్ని అందుకుంటున్న హన్మంత్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్): మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల పరిధి ఎదుల్లాపూర్‌కు చెందిన కల్లూరి హన్మంత్‌రావు రెండవ సారి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తం రావు పటేల్ అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్రశాఖ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతం చేసేందుకు శ్రయశక్తుల కృషి చేస్తానన్నారు.

నేత్రదానం మరో ఇద్దరకి చూపునిస్తుంది



నేత్రదానం చేసిన కాశీపతి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందిస్తున్న లింగామూర్తి

చిన్నశంకరంపేట(మెదక్): నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరికి చూపును ప్రసాదించినవారవుతారని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగామూర్తి అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండలం చందంపేటకు చెందిన గాండ్ల కాశీపతి సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న కాశీపతి ఆనారోగ్యంతో మృతి చెందగా నేత్రదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన నేత్రదానం చేయడంతో మరో ఇద్దరు అంధులకు చూపును అందించగలిగారని చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన కుమారుడు జగన్, కుమార్తే అన్నపూర్ణ ఉన్నతంగా ఆలోచించడంతోనే తండ్రి మృతి చెందిన బాధలోను నేత్రదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపల్లి నరేష్, రాష్ట్ర నాయకులు పరమేశ్వర్, నాగభూషణం, ప్రభులింగం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిపోయిన చింతచెట్టు



కింద పడిన ట్రాన్స్‌ఫార్మర్

చేగుంట (తూప్రాన్): వరుసగా కురుస్తున్న వర్షాలతో శనివారం మండల కేంద్రం చేగుంటలో ట్రాన్స్‌ఫార్మర్‌పై చింతచెట్టు పడిపోయింది. దీంతో స్తంభం విరిగిపోయి ట్రాన్స్‌ఫార్మర్ పిల్లర్‌పై నుంచి కింద పడిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి చింత చెట్టును తొలగించి విద్యుత్ సరఫరా కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. స్తంభం విరిగిపోవడంతో పాటు విద్యుత్ లైన్లు తెగిపోవడంతో హనుమాన్ వీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్టు పడిపోయిన సమయంలో ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఆర్థిక సాయం అందజేత

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చేవెళ్ల గ్రామానికి చెందిన మంగలి నర్సింలు కుటుంబానికి రాజనర్సింహ ఫౌండేషన్ కింద రూ: 25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును శనివారం నర్సింలు భార్య జ్యోతికి అందజేశారు.

ఈత వనంతో గీత కార్మికులకు ఉపాధి

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

కొల్చారం(నర్సాపూర్): ఈత వనాల పెంపకంతో గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందని మెదక్ ఎక్సైజ్ శాఖ సీఐ నాగేశ్వరరావు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని ఎనగండ్ల గ్రామంలో దామర చెరువు కట్టపై వెయ్యి ఈత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత ఏర్పడుతోందని, ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విధిగా మొక్కలు నాటాలని కోరారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో మొక్కలు నాటేందుకు మంచి తరుణం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మాన్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ సర్దార్, ఫీల్డ్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.



ఈత మొక్కలతో ఎక్సైజ్ అధికారులు

సంక్షిప్త వార్తలు

◆ దూప్‌సింగ్ తండా వంతెన పరిశీలన

హవేళీఘణాపూర్(మెదక్): హవేళీఘణాపురం మండలం వాడి పంచాయతీ పరిధిలోని దూప్‌సింగ్ తండాకు వెళ్లే దారిలో వరద ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి,. శనివారం మెదక్ ఆర్డీఓ రమాదేవి దూప్‌సింగ్‌తండాకు చేరుకొని తండావాసులు అటు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సెక్రటరీ వెంకటేశంను ఆదేశించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సింధూరేణుక, గిర్దావర్ ఆబేద్ ఉన్నారు.

◆ పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

పాపన్నపేట(మెదక్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు భీమ్లా, జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, భూషణం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని ప్రకటించి, ,ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉద్యోగులు రిటైర్ అయిన రోజునే అన్ని రకాల బెనిఫిట్స్ అందజేయాలని డిమాండ్ చేశారు.

◆ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిలప్‌చెడ్/కౌడిపల్లి(నర్సాపూర్): మూడు రోజులుగా కురుస్తున్న కౌడిపల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరు మండలాల ఎస్‌ఐలు నర్సింహులు, రంజిత్‌రెడ్డి లు తెలిపారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దన్నారు. శిథిలావస్థలో నివాసముంటున్న ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలన్నారు. విద్యుత్ తీగలను ముట్టుకోవడం, సొంత మరమ్మతులు చేసుకోవద్దన్నారు.

◆ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ ఎన్నికల కార్యాలయ ఇన్‌చార్జి అశోక్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.

◆ కేజీబీవీలో ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్‌లు

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని కేజీబీవీలో ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్‌లు తీసుకుంటున్నామని కేజీబీవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వయంప్రభ శనివారం తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఇరవై సీట్లు, బైపీసీలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

◆ 28న నిధి ఆప్కే నికత్ 2.0

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 28న నిధి ఆప్కే నికత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. నాలుగు కేంద్రాల్లో శిబిరాలను ఉ. 9:30 నుంచి సా. 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. బొల్లారం పరిధిలోని ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, పటాన్‌చెరు పరిధిలోని ఎఆర్ ఝెల్ టైర్స్ లిమిటెడ్, చౌటకుర్ పరిధిలోని ఎంపీ డిస్టిలరీస్ లిమిటెడ్, శేరిలింగంపల్లి పరిధిలోని నానక్రామ్ గూడాలోని కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సెలేనియం టవర్–బీలో నిర్వహించనున్నట్లు చెప్పారు. భవిష్యనిధి సమస్యలు ఉన్న వారు 4 కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

◆ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మునిపల్లి(అందోల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 సంత్సరానికి గాను ఎస్సీ కేటగిరిలో మిగిలిన సీట్లకు డిగ్రీ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.కామ్ (సీ.ఎ, జనరల్, ఆనార్స్, బీ.ఏ, ట్యాక్సేషన్) బీ.ఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు జూలై 31వ తేదీన పదో తరగతి మెమో, టీసీ, బోనాఫైడ్, ఆధార్ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు 5 పాస్ ఫోటోలు తీసుకుని కళాశాలలో సంప్రదించాలన్నారు

◆ సూపర్ లగ్జరీ బస్సుల్లో రాయితీ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సుల టికెట్‌లో ధరలపై రాయితీ ఉంటుందని డిపో మేనేజర్ స్వామి తెలిపారు. రాయితీ 20 శాతం వరకు ఉంటుందన్నారు. బెంగళూరు సర్వీస్ మధ్యాహ్నం 3 గంటలకు జహీరాబాద్ డిపో నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉ. 6.30 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. టిక్కెట్ ధర రూ. 964 ఉండగా రూ.728కి తగ్గించన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



నర్సాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల-2లో ఏఐ శిక్షణను పరిశీలిస్తున్న డీఈఓ

జిల్లా విద్యాధికారి రాధాకిషన్

నర్సాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్య అందించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు రావాలని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో స్థానిక ఎంఈఓ తారాసింగ్, స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ శిక్షణ పరిశీలన

నర్సాపూర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణను విద్యార్థులకు అందిస్తున్న ప్రాథమిక పాఠశాల-2ను డీఈఓ రాధాకిషన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. విద్యార్థులు హోం వర్క్ ఏ మేరకు పూర్తి చేస్తున్నారనే అంశమై వారి బ్యాగుల నుంచి నోట్ బుక్స్ తీసి పరిశీలించారు. అందరూ హోం వర్క్ సకాలంలో పూర్తి చేయాలని ఆయన హితవు పలికారు. ఆయన వెంట ఎంఈఓ తారాసింగ్ ఉన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శనివారం దొంతి కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగు, గణితం మరియు ఇంగ్లిష్, సబ్జెక్టుల్లో బేసిక్స్ బోధించడం ముఖ్యమన్నారు. గణితంలో 5 వ తరగతి వరకు ప్రతీ విద్యార్థికి కనీసం 9 ఎక్కాలు నేర్పించాలన్నారు. గ్రంథాలయాల ఏర్పాటు, వాటి నిర్వహణ తప్పనిసరిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

దేశరక్షణలో యువత ముందుండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ బాలరాజు

ఎస్ఐ బాలరాజు

రామాయంపేట(మెదక్): దేశరక్షణ విషయంలో యువత ముందుండాలని ఎస్ఐ బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. దేశ రక్షణకై యువత ఆర్మీలో చేరాలని, యుద్ధవీరులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంతో మంది యువకులు, విద్యార్థులు ఆర్మీలో చేరి దేశ సేవ కోసం పాటు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో షానిషా ఫౌండేషన్ చైర్మన్ శివ, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యాదగిరి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన పెంచుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): సమాజంలో జరిగే నేరాలు, సైబర్ క్రైమ్‌లపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్ద శంకరంపేటలోని కస్తూర్బా విద్యాలయంలో మేల్కొలుపు కార్యక్రమంలో భాగంగా కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకం, సైబర్‌నేరాలు, రోడ్డు భద్రత, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, చదువుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు, సమాజంలో భద్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్, ప్రభాకర్, ఇసాఖ్, ప్రిన్సిపాల్ విజయ తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పట్టణంలోని శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి తన సొంత నిధులతో మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ కీలకమని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, మల్లేశం, దుర్గాగౌడ్, మల్లేశంచారి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. శనివారం శివ్వంపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ప్లాంట్‌ని ప్రారంభించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రామిరెడ్డి, నవీన్‌గుప్తా, మాధవరెడ్డి, లక్ష్మీకాంతారావు, వేణుగోపాల్‌రెడ్డి, గణేష్, ప్రభులింగంగౌడ్, దావూద్ మల్లేష్, శ్రీనివాస్, రాజు, అరుణ్‌కుమార్, మురళీగౌడ్ తదితరులు ఉన్నారు.



వెల్దుర్తిలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేత రాజిరెడ్డి

గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శరత్

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శరత్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శరత్ అన్నారు. శనివారం శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, మందుల పంపిణీ, రోగులకు అందుతున్న సేవలు, ఆస్పత్రి పరిసరాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గర్భవతులను ముందస్తుగా ప్రభుత్వ అసుపత్రులో చేర్పించాల్సిందిగా సూచించారు. ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వ్యాధులు సోకకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వివిధ శాఖల సిబ్బందికి ఆదేశించారు. విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలని నిర్లక్ష్య ధోరణి అవలంబించే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్, ఆర్డీఓ మైపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుజన, తహసీల్దార్ కమలాద్రి, వైద్యురాలు సాయిసౌమ్య, తదితరులు ఉన్నారు.

ప్రమాదంలో చిట్టారెడ్డి చెరువు

- కోతకు గురవుతున్న కట్ట
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- చెరువులను సందర్శించిన జిల్లా ఎస్పీ

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రం పుల్‌కల్‌లోని చిట్టారెడ్డి చెరువు ప్రమాదపుటంచున ఉంది. చెరువు కట్ట కోతకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు మరమ్మతుల కోసం ఏడాది క్రితం రూ.15 లక్షల నిధులు మంజూరయ్యాయి. వేసవిలో మరమ్మతు చేయకపోవడంతో చెరువు ఈ దుస్థితికి చేరిందని రైతులు ఆరోపిస్తున్నారు..ఈ చెరువును దశాబ్దం క్రితం మిషన్ కాకతీయ పథకం కింద మరమ్మతులు చేశారు. ఈ చెరువు కింద వంద ఎకరాల వరి, పత్తి పంటలు వేశారు. చెరువు కట్టకు తక్షణ మరమ్మతులు చేయకుంటే దిగువన పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చేశారు. కట్ట ఏక్షణంలోనే తెగిపోవచ్చని దిగువన రైతులు బిక్కుబిక్కు మంటూ వ్యవసాయ పనులు చేసుకున్నారు.



కోతకు గురైన చిట్టారెడ్డి చెరువు కట్ట

జిల్లా ఎస్పీ సందర్శన

భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బలహీనంగా ఉన్న చెరువులను పరిశీలిస్తున్నాడు. ఇందులో భాగంగా శనివారం పుల్‌కల్ చిట్టారెడ్డి చెరువును, పోచారం బంగారు వానికుంటను పరిశీలించారు. తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264